కథా కౌముది

# ఓటమి

సన్నిహిత్

' నిజంగా విజయం ఇంత ఆనందాన్ని ఇస్తుందా ! ' అనిపించింది నాకు. అంటే ఇంతకు ముందు నాకు విజయాలు తెలీవని కాదు. అవన్నీ చిన్నవి. ఇప్పుడొచ్చింది పెద్ద విజయం. పల్లెటూర్లో పుట్టి పెరిగిన నేను కష్టపడి ఇంజనీరింగ్ చదువుకున్నాను. చదువు పూర్తవ్వగానే కాంపిటీటివ్ టెస్ట్ లు వ్రాసి గవర్నమెంట్ జాబ్ కి సెలెక్ట్ అయ్యాను. అదీ హైదరాబాద్ లో . మా ఊరు వాళ్ళంతా నన్ను గొప్పగా చూడసాగారు. నా అంతవాడు లేడన్నారు. ఉప్పొంగిపోయాను. ఇంకా మరెన్నో విజయాలు సాధించాలి, పేరు ప్రఖ్యాతులు సంపాదించాలి అన్న దృక్పథం ఆ నాడే నాలో బలపడిపోయింది.

ఎలెక్ట్రానిక్స్ రంగానికి సంబంధించిన రీసెర్చ్ ఓరియెంటెడ్ జాబ్ నాది. రక్షణ రంగానికి సంబంధించిన సంస్థ వాళ్ళు మాకు పని ఇస్తూ ఉంటారు. క్షిపణుల విడి భాగాలను మేము తయారు చేసి ఇవ్వాలి. అది అంత ఆషామాషీ వ్యవహారం కాదు. వారి అవసరాలకు తగ్గట్టుగా డిజైన్ చేసి , అన్ని విధాలా టెస్ట్ చేసి ఇవ్వాలి. చాలెంజింగ్ జాబ్.

నా చేతిలో ఉన్న టెస్టింగ్ రిజల్ట్స్ ప్రింటవుట్ తీసుకొని మా బాస్ కేబిన్ వైపు వెళ్ళాను.

" డా.పరమహంస, ఎం.టెక్, పి.హెచ్ డి " అని వ్రాసి ఉన్న బోర్డ్ ని భక్తి గా చూసుకుంటూ డోర్ నాక్ చేసి ఆయన కేబిన్ లోకి వెళ్ళాను. మా బాస్ పరమహంస కి షుమారు ఏభై ఏళ్ళు ఉంటాయి. కుటుంబ బాధ్యతలన్నింటినీ త్యజించి ఆఫీసుకే అంకితం అయిపోయాడు. ఇంటి బాధ్యతలు తీసుకోమని అతని భార్య పోట్లాడి పోట్లాడి అలసిపోయింది. ఆమె పోరు పడలేక కొంతమంది కుర్రవాళ్ళని , డ్రైవర్ తో సహా ఒక కారుని ఆమెకు ఇంటి వద్ద ఏర్పాటు చేసాడు. ఆమె ' అన్ని ' పనులు ఈ కుర్రాళ్ళతోనే చేయించుకుంటుంది.ఇతని జోలికి చచ్చినా రాదు. ఏ అర్థ రాత్రో ఇంటికి వెళ్ళేటప్పటికి కాసింత ముద్ద పడేస్తుంది. మా బాస్ కి కావాల్సింది కూడా అదే కాబట్టి హేపీగా మమ్మల్ని అందరినీ అర్థ రాత్రి దాకా నంజుకు తింటూ ఉంటాడు. తనలాగే తన కింద పని చేసే వాళ్ళందరూ ఆఫీసుకు అంకితమ అయిపోవాలని ఆశిస్తూ ఉంటాడు.

" కం ...కం...షో మి ద రిజల్ట్స్ " అంటూ నా చేతిలోని పేపర్లు లాక్కున్నాడు . అప్పటికి టైము సాయంత్రం ఐదు కావస్తుంది. ప్రతీ రోజూ ఈ టైముకి మేము అతన్ని కలిసి మా ఔట్ పుట్ చూపించాలి.

" వెరీ గుడ్ ...ఎవిరీ థింగ్ ఈజ్ ఏజ్ ఎక్స్ పెక్టెడ్ " అంటూ తన పిల్లి గడ్డాన్ని నిమురుకున్నాడు.

"హమ్మయ్య ...ఈ రోజుకి నన్ను వదిలేస్తాడు " అనుకున్నాను. కానీ నా పప్పులు ఉడకలేదు.

" అన్నీ బాగానే ఉన్నాయి. కానీ నాకు ఇంకా కొంచెం క్లారిటీ కావాలి. వేరే పేరామీటర్స్ కూడా ఎక్స్ ట్రేక్ట్ చేసి ప్లాట్ చేసి తీసుకురండి " అని చెప్పాడు. నా గుండెల్లో రాయి పడింది. అవన్నీ చేయాలంటే కనీసం నాలుగు గంటలు పడుతుంది.

" సార్ ...ఈ రోజు కొంచెం తొందరగా వెళదామనుకున్నాను " అంటూ నసిగాను.

" ఏం తొందరయ్యా ? మాకు లేదా తొందర ? బేచిలర్ వేకదా ! ఇంటికెళ్ళి ఏం చేస్తావు ? నువ్వు వెళ్ళిపోతే పనెవడు చేస్తాడు ? " అంటూ గట్టిగా అరిచాడు. నోరు పెగల్లేదు నాకు.

" అలాగే సార్ ! ఉంటాను " అని చెప్పి వచ్చేసాను. నా మీద నాకే జాలేసింది. పేరుకు గవర్నమెంట్ జాబే అయినా ప్రైవేట్ కంటే అధ్వాన్నం. ఒక్కో సారి బాగా తిరగబడాలనిపిస్తుంది. కానీ కెరీర్ మొదట్లో ఉన్నాను. ఏ చిన్న రిమార్క్ వచ్చినా చెడ్డ పేరు. పైగా అందరూ సిన్సియర్ గా పని చేసుకుంటూ ఉంటే నేను వెళతాననడం ఏం బాగుంటుంది. అందుకే అన్నీ మూసుకొని నా సీట్ కి వచ్చేసాను.

* * *

మొదట్లో స్కూల్ కి వెళ్ళనని మొరాయించి , తర్వాత తనే పరుగెత్తుకుంటూ వెళ్ళే పిల్లాడిలా క్రమంగా మా ఆఫీసు కల్చర్ కి అలవాటు పడిపోయాను. రోజూ ఇంటికి వచ్చేటప్పటికి రాత్రి పది దాటేది. బేచిలర్ ని కాబట్టి బయట మెస్ లో భోంచేసి రూం కి వచ్చే వాడిని. కాసేపు టీవీ చూసి నిద్రపోయే వాడిని. మళ్ళీ పొద్దున్న లేచి రడీ అయి ఆఫీసుకి వెళ్ళిపోయేవాడిని. ప్రతీ రోజూ ఇదే నా దినచర్య. నా సిన్సియారిటీ కి మా బాస్ కూడా మురిసిపోయే వాడు. మొత్తానికి నా దారికొచ్చాడు అనుకుంటూ సంతృప్తి పడ్డాడు. కానీ నా లక్ష్యం వేరు. నేను తొందరగా కెరీర్ లో పైకి రావాలి. అందుకోసం కష్టపడి బాగా పని చెయ్యాలి. ఒంట్లో ఓపిక ఉన్నప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కష్టపడతాం ? మీరే చెప్పండి !

మన బ్రతుకు మనం హాయిగా బ్రతికేస్తూ ఉంటే దేవుడికి కూడా కన్ను కుడుతుంది. అందుకే ఆయన ఖాళీ గా ఉన్న నా తల్లిదండ్రులని ఏక్టివ్ చేసాడు.

" ఏరా ..జాబ్ లో సెటిల్ అయ్యావు . ఇంకా ఎంత కాలం బయట తింటావు. పెళ్ళి చేసుకోవా ? " అంటూ మా నాన్న నన్ను ఫోన్ చేసి మరీ చావగొట్ట సాగాడు. వాళ్ళ పోరు పడలేక " మీరే ఒక అమ్మాయి ని చూడండి నాన్నా ...చేసుకుంటాను " అని చెప్పేసాను. అన్నట్టుగానే వాళ్ళు ఒక అమ్మాయిని చూసారు. నన్ను పెళ్ళి చూపులకి రమ్మన్నారు . " అక్కర్లేదు నాన్నా , అమ్మాయి ఫోటో పంపించండి చాలు " అని చెప్పాను. నేను వాళ్ళ మాట జవదాటనని సంతోషపడిపోయారు. కానీ నా ఆలోచన వేరు. పెళ్ళి పట్ల నాకు పెద్ద సదభిప్రాయం లేదు. అదో పెద్ద గుది బండ. కానీ ఎంతకాలం తప్పించుకోగలను. ' ఎవరో ఒకరిని చేసుకుంటే సరి. పెళ్ళయ్యాక అదే ఇంట్లో పడి ఉంటుంది ' అనుకుని ఒప్పుకున్నాను.

అమ్మాయి ఫోటో చూసి నేను ఒకే చెప్పాక అన్ని పనులు చక చకా జరిగిపోయాయి. పెళ్ళి ముహూర్తం రానే వచ్చింది. నేను మా బాస్ దగ్గరికి వెళ్ళి " సార్...నా మేరేజ్ సెటిల్ అయింది , ఒక పదిహేను రోజులు లీవ్ కావాలి " అని అడిగాను.

" ఓహ్...కంగ్రాట్స్ ! అయినా పెళ్ళికి పదిహేను రోజులు ఎందుకు ? వారం చాలు.డోంట్ వేస్ట్ యువర్ టైం యార్ "

అని చెప్పాడు. నాకూ అది నిజమే అనిపించింది. " థాంక్యూ " అని చెప్పి వచ్చేసాను.

అంగరంగ వైభోగంగా నా పెళ్ళి జరిగింది. జీవితంలోని కొత్త కొత్త రుచులు , ఆనందాలు తెలిసి వచ్చాయి. వాటితో పాటూ బాధ్యత కూడా నా ' భార్య ' రూపంలో వెన్నంటి వచ్చింది. ఒక పెద్ద ఇల్లు అద్దెకు తీసుకొని నా కాపురాన్ని అందులోకి మార్చేసాను. ఇంట్లోకి కావాల్సిన గృహోపకరణాలు అన్నీ కొని పడేసాను. నా భార్యతో పాటూ అవి కూడా ఒక అవసరం కదా మరి !

నా జీవితంలో పెళ్ళి వల్ల పెద్ద మార్పులేమీ రాలేదు. ఇంతకు ముందు లాగే పది దాటాకే ఇంటికి వస్తున్నాను. కాకపోతే ఇంతకు ముందు రాత్రిళ్ళు బయట మెస్ లో తినే వాడిని. ఇప్పుడు ఇంట్లో తింటున్నాను. అంతే తేడా ! జీవితం సాఫీగా , నాకు నచ్చినట్లుగా సాగిపోతోంది. అయితే , వర్షం, చావు లాంటివి చెప్పి రానట్లు సమస్యలు కూడా సడన్ గా వస్తాయి అని నాకు త్వరలోనే తెలిసింది.

* * *

" మీరు తండ్రి కాబోతున్నారు " అని నా భార్య సిగ్గు పడుతూ చెప్పింది. నెత్తి మీద పెద్ద సుత్తితో ఎవరో కొట్టినట్లుగా ఫీల్ అయ్యాను. సినిమాల్లో చూపించినట్లు నా భార్యను కౌగిలించుకొని ' ఎంత తియ్యటి వార్త చెప్పావు ' అంటూ నేను పొంగిపోలేదు. మౌనంగా ఉండిపోయాను. దానిక్కారణం ఉంది. త్వరలోనే మాకు ప్రమోషన్ ఇంటర్వ్యూలు ఉన్నాయి. చాలా కాంపిటీషన్ ఉంటుంది . అందులో నెగ్గాలంటే మరింత బాగా పని చేసి మా బాస్ ని ఇంప్రెస్ చెయ్యాలి. ఆఫీసులో ఎంతసేపైనా గడపాలి. మా ఇంటర్వ్యూ ప్రాసెస్ అంతా అవడానికి ఎలా లేదన్నా ఏడెనిమిది నెలలు పడుతుంది. ఈ టైములో నా భార్య గర్భంతో తిరుగుతూ ఉంటే నాకు డిస్టర్బెన్స్ ! అందుకే ఈ వార్త నాకు అశనిపాతమైంది.ఎటూ తేల్చుకోలేని పెద్ద సమస్యలా కనపడసాగింది.

" ఏంటండీ ...అలా నిశ్శబ్దంగా ఉన్నారు. మీకు ఇష్టం లేదా ? " నెమ్మదిగా అడిగింది నా భార్య

" అవును. నాకు ఇష్టం లేదు " అని చెప్పాను

" పోనీ లెండి నేను మా పుట్టింటికి వెళ్ళిపోతాను , మీకు అడ్డుగా ఉండను "

" అంటే ఏంటి నీ ఉద్దేశ్యం ? భార్యను కూడా పట్టించుకోని ఒక రాక్షసుడిలా నన్ను చిత్రీకరించాలనుకుంటున్నావా ? " గట్టిగా అడిగాను. నా గొంతు నాకే విచిత్రంగా ఉంది. ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు నేను. బహుశా పరిస్థితులే మనిషికి మాటలు నేర్పుతాయేమో !

దెబ్బతిన్నట్లు చూసింది నా భార్య. ఆమె కళ్ళల్లో సుడులు తిరుగుతున్న కన్నీళ్ళు . షిట్ ! ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్ ! నేను లొంగ దలచుకోలేదు. చెయ్యాల్సిన పని చాలా ఉంది కాబట్టి రడీ అయి ఆఫీసుకి వచ్చేసాను.

మా బాస్ కేబిన్ లో .....

" నీ సిన్సియారిటీ నాకు చాలా నచ్చిందయ్యా! . మన టెస్టింగ్ ఫెసిలిటీ కోసం ఫారెన్ నుండి ఒక ఎక్విప్మెంట్ కొందామని ప్లాన్ చేస్తున్నాను. దానికి సంబంధించిన గ్రౌండ్ వర్క్ అంతా నువ్వు చెయ్యి. డిజైన్ రివ్యూ కోసం మనిద్దరం అక్కడికి వెళదాం..ఒకేనా " పిల్లిగడ్డాన్ని గోక్కుంటూ వల విసిరాడు మా బాస్.

నా మనసు ఆనందంతో గంతులేసింది. మా గవర్నమెంట్ జాబ్స్ లో ఫారెన్ వెళ్ళే చాన్సు రావడం చాలా అరుదు. కష్టపడి నిజంగా పనిచేసే ప్రతిభ ఉన్న వాళ్ళకే ఆ అవకాశం వస్తుంది. అంటే ఇన్నాళ్ళకి మా ఆర్గనైజేషన్ నా ప్రతిభను గుర్తించిందన్న మాట. ! చాలా గర్వంగా ఫీల్ అయ్యాను. నేను ఫారెన్ వెళ్ళానని తెలిస్తే మా ఊళ్ళో కూడా నా గొప్పతనం పెరుగుతుంది.

" థాంక్యూ సార్ ! తప్పు కుండా అన్ని డిటెయిల్స్ సిద్ధం చేస్తాను. " అని ఉత్సాహంగా చెప్పాను.

" అది సరే ! దాని కోసం నువ్వు ఇంకా కష్టపడాల్సి ఉంటుంది. కొన్ని త్యాగం చెయ్యాల్సి ఉంటుంది.జీవితంలో ఏదీ సులభంగా దొరకదు .అర్థమైందా ? " అంటూ నవ్వాడు బాస్.

" అర్థమైంది సార్ " అని చెప్పి అక్కడ నుండి వచ్చేసాను. వాడి గోలంతా సాయంత్రాలు నేనెక్కడ తొందరగా ఇంటికి వెళ్తానేమోనని భయం. వాడితో పాటూ అర్ధరాత్రి దాకా కంపెనీ ఇవ్వడానికి ఎవడో ఒక బకరా కావాలి కదా ! కానీ నాక్కావలసింది కూడా వాడి ఆ బలహీనతే ! కుటుంబాన్ని గాలికి వదిలేసి సాయంత్రాలు పని చేసే వాళ్ళంటే మా బాస్ కి చాలా ఇష్టం. నేను ఆ ఇష్టాన్ని కేష్ చేసుకోవాలనుకున్నాను. సాయంత్రాలు పని ఉన్నా లేకపోయినా ఏదో ఒక టెక్నికల్ ఇష్యూ తో ఆయన కేబిన్ కి వెళ్తూ ఉండేవాడిని. నేననుకున్నట్లుగానే నా వలలో పడ్డాడు బాస్. నన్ను ఫారెన్ పంపించేదాకా వచ్చాడు. అదీ నా తెలివి !

ఆ సాయంత్రం మరింత బాగా పనిచేసి రాత్రి పది దాటాక ఇంటికివచ్చాను. నిరాసక్తంగా నా భార్య భోజనం వడ్డించ సాగింది. ఆమె మొహం లోకి పరిశీలనగా చూసాను. ఆనందం అనేది ఎంత వెతికినా కనపడ్డంలేదు. ఏం తక్కువైందని ఆమెకు ఈ విషాదం ? కొంతమంది అంతే ! అన్నీ ఉన్నా కూడా ఏదో కోల్పోయినట్లు ఎప్పుడూ ఏడుస్తూ ఉంటారు. అయినా నాకవన్నీ అనవసరం . ఎక్కువ ఇన్ వాల్వ్ అయితే ఎక్కువ బాధపడాల్సుంటుంది. అందుకే భోంచేసి ఏమీ ఎరగనట్లు నిద్రపోయాను.

* * *

ఆఫీసు కాంఫరెన్స్ హాల్లో మేమంతా కూర్చున్నాము. మా బాస్ చెబుతున్నాడు.

" వెల్ కం ఫ్రెండ్స్ ! మీరంతా ఈ సారి ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూ కి వెళ్ళబోతున్నారు కదా. ఆర్గనైజేషన్ లో కాంపిటీషన్ చాలా ఎక్కువైంది. ఇంటర్వ్యూ ఎవరు బాగా చేస్తే వాళ్ళనే క్లియర్ చేస్తున్నారు. నేను బోర్డ్ లో ఉన్నప్పటికీ మీరు బాగా చెబితేనే సపోర్ట్ చేస్తాను. లేకపోతే నేనేమీ చెయ్యలేను. ఆ తర్వాత నన్ను నిందించి ఉపయోగం లేదు " చెప్పుకు పోతున్నాడు.

ఆ క్షణంలో నా కంటికి ఆయన ఒక డ్రిల్లు మాష్టారి లా కనిపించాడు. ఒక పెద్ద గ్రౌండ్ లో పరుగు పందెం కోసం సిద్ధంగా ఉన్న క్రీడాకారులని చూస్తూ విజిల్ ఊది ఆట ప్రారంభించినట్లు అనిపించింది. మా అందరిలోనూ పైకి కనిపించని టెన్షనూ , పోటీ మొదలైపోయింది. రేట్ రేస్ ! నా కైతే ప్రమోషన్ అన్న గమ్యం మాత్రమే కనిపిస్తోంది. ఎలాగైనా సాధించాలి. అందరి కంటే గొప్ప అనిపించుకోవాలి. మీటింగ్ పూర్తవ్వగానే నా సీట్ కి వచ్చి గేం ప్లాన్ ప్రిపేర్ చేసుకున్నాను. పొద్దున్న లేచినప్పటి నుండి రాత్రి నిద్రపోయే దాకా నేను చెయ్యాల్సిన పనులన్నీ వ్రాసుకున్నాను. చిత్రంగా అందులో నేనూ , నా భార్య కలిసి చెయ్యాల్సిన పనులేవీ లేవు. గ్రేట్ ! నా ప్లానింగ్ కి నేనే సంబరపడిపోయాను.

ఒక వైపు ఇంటర్వ్యూ ప్రిపరేషన్ , మరో వైపు ఫారెన్ ఎక్విప్మెంట్ వర్క్ తో పూర్తిగా బిజీ అయిపోయాను. పొద్దున్నే ఆఫీసుకి వెళ్ళడం , రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోవడం . రోజూ ఇదే పని . ఇంట్లో ఏం జరుగుతుందో కూడా నాకు తెలీదు. పెరుగుతున్న నాభార్య పొట్ట మాత్రం నన్ను భయపెడుతూ ఉండేది. అప్పుడప్పుడు ఇంట్లో ఎవరో చుట్టాలు కనిపిస్తుండేవారు.నా భార్యని చూడటం కోసం వచ్చిన వాళ్ళట ! . వాళ్ళ సంగతి నా భార్య చూసుకుంటుందిలే అని లైట్ గా తీసుకొనే వాడిని , పైగా వాళ్ళతో మాట్లాడటం పెద్ద టైం వేస్ట్ !

కొన్ని రోజుల తర్వాత...

ఎప్పటి లాగే రాత్రి పది దాటాక ఆఫీసు నుండి వచ్చేటప్పటికి నాకు చాలా ఆశ్చర్యమేసింది. దానిక్కారణం ఇంట్లో అన్ని వస్తువులు యధాతథంగా ఉన్నాయి. కానీ నా భార్యలేదు. ' ఇప్పుడు నాకు భోజనం ఎవరు వడ్డిస్తారు ' అనుకుంటూ కాసేపు అసహనంగా అటూ ఇటూ తిరిగాను. చివరకు కంప్యూటర్ టేబుల్ మీద ఒక లెటర్ కనపడింది. క్యూరియస్ గా ఓపెన్ చేసాను.

" ఏమండీ -

దయచేసి ఉత్తరాన్ని చివరిదాకా చదవండి. టైం వేస్ట్ అని పక్కన పడేయకండి. మీరు నాతో ఎక్కువ సమయం గడపడం లేదు అని నిందించను. భార్యలకు దూరంగా ఆర్మీలో ఉద్యోగాలు చేసే వారు, విదేశాల్లో ఉండేవారు నాకు తెలుసు. వాళ్ళ సంసారాలన్నీ సజావుగానే ఉన్నాయి. వాళ్ళంతా సంతోషంగానే ఉన్నారు. అవసరమైనప్పుడు మనిషి సర్దుకుపోవాలి.ఆ మాత్రం ఇంగితం నాకుంది. కానీ మీరు నన్ను ఒక మనిషిగా కూడా గుర్తించడం లేదు. ఏనాడూ నా సరదాలని, సంతోషాలని పట్టించుకోలేదు. అయినా ఫర్వాలేదు. కనీసం ఒక మాట , ఒక ఓదార్పు, ఒక ప్రేమతో కూడుకున్న స్పర్శ లాంటివి కూడా మీరు నాకివ్వలేదు. ఇంట్లో వస్తువలతో పాటూ సమానంగా , మీ అవసరం తీర్చే ఒక గాడ్జెట్ లా ట్రీట్ చేసారు. మా వాళ్ళనందరినీ వదులుకొని , మీ మీద ఇష్టంతో ఎన్నో ఆశలతో వచ్చాను. ఇదేనా మీరు నాకు ఇచ్చేది ? అయినా తప్పు మీది కాదు లెండి , మీ మనస్తత్వానిది. జీవితంలో ఏదో సాధించెయ్యాలి అన్న మీ తపనది. అందుకే మీకు డిస్టర్బెన్స్ లేకుండా నేనే మా పుట్టింటికి వెళిపోతున్నాను. ఇక మీరు హాయిగా లక్ష్య సాధనకు శ్రమించండి. డెలివరీ అవగానే మీకు తెలీయజేస్తాను. కనీసం అప్పుడైనా రండి. ఆరోగ్యం జాగ్రత్త . ఉంటాను "

సెంటిమెంటల్ ఫూల్ !. జీవితం విలువ , టైం విలువ తెలీదు అని చిన్నగా నవ్వుకుంటూ ' హమ్మయ్య ! ' అనుకున్నాను. ఒక తలనొప్పి వదిలింది. నా భార్య ఎత్తైన పొట్టతో నా కళ్ళ ముందు తిరుగుతుంటే ఏదో గిల్టీ ఫీలింగ్ ఉండేది. ఇప్పుడది పోయింది. ఫ్రీ బర్డ్ అయిపోయాను. కానీ త్వరలోనే నా అహం రెక్కలు తెగి పడే అనుభవం ఒకటి ఎదురవుతుందని నేను ఊహించలేకపోయాను.

* * *

ఆఫీసులో ఒక సాయంత్రం , మా బాస్ ని ఎలా బుట్టలో వేసుకోవాలా అని ఆలోచిస్తుండగా సెల్ రింగ్ అయింది.

లిఫ్ట్ చేసి " హలో ...చెప్పండి " అన్నాను. " నేనయ్యా ...మీ మామగారిని . కంగ్రాచ్యులేషన్స్ ! మీకు అబ్బాయి పుట్టాడు " అని చెప్పారు.

నా మనసు అట్టడుగు పొరల్లో ఒక చిన్న కదలిక. తొలిసారిగా వర్ణించలేని ఒక కొత్త అనుభూతి. తేరుకొని " థాంక్యూ అండీ ...వీలు చూసుకొని చూడ్డానికి వస్తాను " అని చెప్పి ఫోన్ పెట్టేసాను.వెంటనే మా బాస్ కేబిన్ కి వెళ్ళాను.

" ఆ...చెప్పు...ఎనీ టెక్నికల్ ప్రోబ్లెం ? " అడిగాడు హుషారుగా.

" నో ప్రోబ్లెం సార్. ఎవ్రీ థింగ్ ఆల్ రైట్ ! నాకు కొడుకు పుట్టాడు . చూడ్డానికి వెళ్ళాలి.రేపు లీవ్ ఇవ్వండి " సూటిగా అడిగాను.

" కంగ్రాట్స్ ! కానీ ఇప్పుడే వెళ్ళడం ఎందుకు ? తర్వాత వెళుదువు గాని. అయినా నువ్వు వెళ్ళి చేసేదేముంది ? పైగా మన ప్రోడెక్ట్ ని తొందరగా ఇమ్మని డిఫెన్స్ వాళ్ళు ప్రెజరైజ్ చేస్తున్నారు " అంటూ నసగడం మొదలు పెట్టాడు.

తొలిసారిగా మా బాస్ మీద నాకు కోపం వచ్చింది.కంట్రోల్ చేసుకున్నాను. " నేను రేపు ఆఫీసుకి రావడం లేదు సార్ ! " అని చెప్పి వచ్చేసాను. నా ప్రవర్తన నాకే వింతగా ఉంది. " నేనేంటి...నా బాస్ ని ఎదిరించడం ఏంటి ? నా నాలుక మీద నాకే కంట్రోల్ తప్పిపోయింది" అనుకున్నాను. ఎప్పుడెప్పుడు కొడుకుని చూద్దామా అని నా మనసు తొందర పెట్ట సాగింది.ఆ రాత్రికే బయలుదేరి నా భార్య దగ్గరకు వెళ్ళాను.

ఖరీదైన కార్పొరేట్ హాస్పిటల్ స్పెషల్ రూములో నా భార్య నిస్త్రాణంగా పడుకొని ఉంది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన ఆనందం ఆమె మొహంలో ఇంకా దోబూచులాడుతోంది. బహుశా తన ఒంటరి తనాన్ని పారద్రోలే ఒక తోడు దొరికాడన్న నిశ్చింత కాబోలు ! . బెడ్ పక్కనే కూర్చుని మొదటిసారి ప్రేమగా ఆమెను స్పృశించాను. చిన్నగా కదిలి మళ్ళీ నిద్రలోకి జారుకొంది. నా కళ్ళు బాబు కోసం వెదికాయి.

" మీ అబ్బాయి తక్కువ బరువుతో పుట్టాడు. అందుకనే పక్కనే ఉన్న ఎన్.ఐ.సి.యు లో ఇంకుబేటర్ లో ఉంచారు " అని చెప్పారు మా మామగారు." ఆహా .." అని తలాడించి ఎన్.ఐ.సి.యు కి వెళ్ళాను.

ఎన్.ఐ.సి.యు లో ఇంకుబేటర్ లోపల లైట్లవెలుగులో నవ్వుతూ ఆడుకుంటున్నాడు నా కొడుకు. ఒళ్ళంతా ఏవో క్లిప్పులు, వైర్లు ! . నర్సుల పర్యవేక్షణలో ఉన్నాడు. అచ్చం నాలాగే ఉన్నాడు.ఆ కళ్ళు , ముక్కు , చెవులు అన్నీ నా పోలికల్తో నా నోట్లోంచి ఊడిపడ్డట్టు ఉన్నాడు . అదో రకమైన ఆనందం కలిగింది .నా శరీరంలోని భాగమేదో ప్రాణం పోసుకుని అక్కడ ఉన్నట్లుగా అనిపించింది.

" ఎత్తుకోండి సార్ ! " అంటూ నర్సు మా అబ్బాయి ని నా చేతిలో పెట్టింది. చేతుల్లోకి తీసుకొని పదిలంగా పట్టుకున్నాను. వాడు నవ్వుతూ నా చేతి వేళ్ళని గట్టిగా పట్టుకున్నాడు.ఏదో బంధం , పాశం నన్ను కట్టిపడేసింది. అలాగే కాసేపు ఎత్తుకుని మళ్ళీ నర్సుకి ఇచ్చేసాను.

" బేబీ కి పాలు తీసుకు రండి " అని చెప్పింది నర్సు. తిరిగి నా భార్య దగ్గరకు వచ్చేసాను. నా భార్యనడిగి ఆమె ఇచ్చిన తన చనుబాలని చిన్న బాటిల్ లో తీసుకెళ్ళి నర్సుకు ఇచ్చాను.ఆమె మా అబ్బాయికి త్రాగించింది. దురదృష్టవంతుడు. తల్లి పక్కలో పడుకొని తాగే అవకాశం లేదు మా అబ్బాయికి.

నా ప్రమేయం లేకుండానే నా భార్యని , కొడుకుని చూసుకోవడంలో మునిగిపోయాను. ఒక్కరోజు లీవ్ అంటూ వచ్చిన నాకు మూడు రోజులయిన సంగతి కూడా తెలీలేదు. క్రమంగా నా మనసుకి ఉన్న ' నాకు నేనే ముఖ్యం ' అన్న సెల్ఫ్ మేడ్ ముసుగు

తొలగసాగింది.  నాలుగో రోజు మా బాస్ ఫోన్ చేసాడు.

" హలో....వేర్ ఆర్ యు ?ఒక్క రోజని చెప్పి ఇంకా రాలేదేంటి ? " అంటూ అరుస్తున్నాడు.

" నేనిక్కడ ఉండాల్సిన అవసరం ఉంది సార్ ! వారం తర్వాత వస్తాను. రాగానే ఆబ్సెంట్ అయిన రోజులన్నిటికీ లీవ్ ఎప్లై చేస్తాను "

" నో...నో...యు హేవ్ టు కం ఇమీడియట్లీ " ఆర్డర్ వేస్తున్నాడు

" సారీ సార్ ! నేను రాలేను " నమ్రతగా చెప్పాను

" దెన్ ఐ విల్ నాట్ సపోర్ట్ యు ఫర్ ద ఇంటర్వ్యూ...ఈవెన్ ఐ విల్ నాట్ టేక్ యు ఎబ్రాడ్ " బెదిరిస్తున్నాడు

" ఫర్వాలేదు సార్ ..నేనేమీ చెయ్యలేను ..ఓకే ! " అని చెప్పి ఫోన్ పెట్టేసాను.  రిలీఫ్ గా అనిపించింది. ఇన్నాళ్ళూ మా బాస్ ఆడిన మైండ్ గేం లో పడి నన్ను నేను కోల్పోయాను. అయితేనేం ఇప్పుడు లక్షల విలువైన ' సత్యాన్ని ' తెలుసుకున్నాను.

అవును...మా బాస్ పెట్టిన పరుగు పందెం లో ' నేను ఓడిపోయాను ' . కానీ నాలోని అహాన్ని , మూర్ఖత్వాన్ని, స్వార్థాన్ని తెగ నరికి ' మానసిక  విజయం ' సాధించాను. జీవితానికి ఉన్న  అర్థం తెలుసుకున్నాను.అది చాలు నాకు !!

--------------o-------------------------

Click here to share your comments on this story